# సాక్షి ప్రకాశం

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024




### ఇంట్లో కూర్చునే మద్యం దుకాణానికి దరఖాస్తు



రూ.2 లక్షలు ఉన్న ఎవరైనా ఇంట్లో కూర్చునే మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు.

- 8లో..



### లడ్డూ కల్తీపై జర్నలిస్టుల పాత్ర ఆక్షేపణీయం

తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని చంద్రబాబు అనగానే జర్నలిస్టులు యధాతథంగా రాసేయడం ఆక్షేపణీయమని ప్రముఖ జర్నలిస్టు ఏఎం ఖాన్ యజ్దానీ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36.9/27

### వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### వీఓఏలపై కక్ష సాధింపు ధోరణి తగదు

- రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా వీఓఏల సంఘం అధ్యక్షుడు గంగాధర్ విజ్ఞప్తి



వీఓఏల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్న వీఓఏల సంఘం నాయకులు

**ఒంగోలు టౌన్:** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వీఓఏలపై కక్ష సాధింపు ధోరణికి పాల్పడుతోందని, ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదని వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.గంగాధర్ అన్నారు. వీఓఏల సమస్యలపై సంఘం రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వందల సంఖ్యలో వీఓఏలను తొలగించారని ఆరోపించారు. చిరుద్యోగుల పొట్టలు కొట్టడం తగదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం తొలగించిన వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న వీఓఏలకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని, దాంతో వీఓఏల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీఓఏల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీని అమలు చేయాలని, జెండర్ సమస్య లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. వీఓఏల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసరావు, వీఓఏల సంఘం ఉపాధ్యక్షుడు షేక్ జరీనా, కాశీరత్నం, అజరా బీ, శ్రీదేవి, భ్రమరాంబ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### ఒనూడా వైస్ చైర్మన్‌గా జేసీ గోపాలకృష్ణ



ఒనూడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న జేసీ రోనంకి గోపాలకృష్ణ

**ఒంగోలు సబర్బన్:** ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒనూడా) వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ (జేసీ) రోనంకి గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు వైస్ చైర్మన్‌గా ఉన్న ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావును బదిలీ చేయటంతో పోస్టు ఖాళీ అయింది. అందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నంబర్–1679ని విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఈ నెల 3వ తేదీ ప్రత్యేకంగా జీఓ విడుదల చేశారు. అనంతరం ఒనూడా అధికారులు, సిబ్బందితో సంతపేటలోని ఒనూడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కార్యాలయ పనితీరుపై మాట్లాడారు. ఒనూడాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అందుకు సంబంధించిన ప్లానింగ్ విభాగం పనితీరుపై సమీక్షించారు. భవనాలు, పారిశ్రామిక అప్రూవల్స్ గురించి మాట్లాడారు. ఒనూడా కార్యాలయం ప్రైవేటు భవనంలో ఉండటంతో కార్యాలయ భవనం కోసం సరైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనధికార లే అవుట్స్‌పై కఠినంగా వ్యవహరించాలని, ఈ విషయంలో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్య వైఖరి వహించినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒనూడా సెక్రటరీ ఈదా వెంకట రెడ్డి, ఈఈ ఏ.శేషగిరి రావు, ప్లానింగ్ విభాగం అధికారి హిమబిందుతో పాటు డీఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పచ్చ ఖాకీ!

పోలీస్ స్టేషన్లు టీడీపీ కార్యాలయాలుగా మారిపోయాయి. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన వారు అధికార పార్టీ నేతల చేతుల్లో కీలుబొమ్మల్లా మారిపోయారు. తమ బాధ్యతలు పూర్తిగా పక్కకు పెట్టి పొలిటికల్ బాస్‌ల సేవలో తరిస్తున్నారు. తమ మాట వినని వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రైవేటు పంచాయితీల్లో సైతం జోక్యం చేసుకుంటూ బాధితులపై లాఠీలు ఝుళిపిస్తున్నారు. పోలీసుల తీరుపై బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఫ్రెండ్లీ పోలీస్ అన్నమాటకు అర్థం మారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



- పోలీసు స్టేషన్లలో చక్రం తిప్పుతున్న తెలుగు తమ్ముళ్లు
- పొలిటికల్ బాస్‌ల సేవలో తరిస్తున్న ఖాకీలు
- సివిల్ పంచాయితీల్లో తలమునకలు
- ఒంగోలు తాలూకా పోలీసుల తీరుతో స్టేషన్లోనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నం
- టూ టౌన్ పోలీసుల చిత్రహింసలు తాళలేక మరో వ్యక్తి పురుగుల మందు తాగిన వైనం
- పోలీసుల అక్రమ కేసులపై న్యాయస్థానం తలుపుతడుతున్న బాధితులు

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** జిల్లాలో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు రెచ్చిపోతున్నారు. సహజంగా పోలీసులు తమ శాఖ బాస్ ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు. ప్రస్తుతం జిల్లాలో అందుకు భిన్నంగా ఉంది పరిస్థితి. పొలిటికల్ బాస్ కనుసైగలతో విధులు నిర్వహిస్తుండడం పలు వివాదాలకు కారణమౌతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుల వేధింపులు తాళలేక జిల్లాలో పది రోజుల వ్యవధిలో ఇద్దరు బాధితులు ఆత్మహత్యకు యత్నించడం ఖాకీల 'పచ్చ' దాష్టీకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**చిత్తూరు కేసుకు ఒంగోలులో పరిష్కారమా...**

చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం గ్రామానికి చెందిన దళిత యువకుడు దామరగుంట కుమార్ అదే గ్రామానికి చెందిన చిత్తూరు చంద్రబాబు, చిరిపిరెడ్డి, నరసింహారెడ్డిల వద్ద పది రూపాయల వడ్డీతో రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. నెలనెలా వాయిదాల ప్రకారం రూ.5 లక్షలు చెల్లించాడు. మిగిలిన రూ.5 లక్షల కోసం ఒత్తిడి చేస్తుండడంతో తన ఇంటిని, మూడెకరాల పొలాన్ని రాసిచ్చాడు. ఊరొదిలి ఒంగోలుకు వచ్చి కేటరింగ్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చిత్తూరు చంద్రబాబు ఒంగోలుకు చెందిన టీడీపీ నాయకుడు ఉండవల్లి రాము సహకారంతో సెప్టెంబర్ 21వ తేదీ వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న కుమార్ ఇంటిమీదకు దాడికి వెళ్లారు. భయాందోళనకు గురైన అతడు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడంతో తాలుకా పోలీసులు రంగ ప్రవేశం చేశారు. బాధితుడిని విచారించిన సీఐ అజయ్ కుమార్ ఇది చిత్తూరు కేసు కనుక అక్కడకు వెళ్లి పరిష్కరించుకోండని చెప్పారు. మరుసటి రోజు కుమార్‌కు ఫోన్ చేసిన ఎస్‌ఐ తాలుకా పోలీసు స్టేషన్‌కు రమ్మని, సమస్యను ఇక్కడే పరిష్కరిద్దామని పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే అక్కడ చిత్తూరు చంద్రబాబు, ఉండవల్లి రాము కూర్చొని ఉన్నారని, వారి ముందు ఎస్‌ఐ చేయి చేసుకున్నాడని ఆరోపిస్తూ బాధితుడు కుమార్ పోలీసుల ఎదుటే ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. ఇది జిల్లాలో సంచలనం సృష్టించింది. వెంటనే జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందించడంతో అతడు చావు నుంచి తప్పించుకున్నాడు.

**న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్న దేకనకొండ బాధితులు...**

కురిచేడు మండలంలోని దేకనకొండలో వినాయక చవితి పండుగ గ్రామంలో చిచ్చురేపింది. గ్రామంలో ఇరువర్గాలు వేరువేరుగా వినాయక మండపాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో టీడీపీ శ్రేణులు రెచ్చి పోయారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఇళ్లపై రాళ్ల దాడికి దిగారు. ఈ దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తీసుకెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ వివాదం ముదిరి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సానుభూతిపరుల మీద కేసులు బనాయించారు. వారు న్యాయం కోసం హైకోర్టు తలుపుతట్టారు. యర్రగొండపాలెం మండలంలో కూడా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మురారిపల్లిలో మంచినీటి ట్యాంకర్‌లో పురుగుల మందు కలిపిన నిందితులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతటితో ఊరుకోకుండా తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ఎరిక్షన్‌బాబు హుకుం జారీ చేయడంతో పోలీసుల సమక్షంలోనే బాధితులపై దాడులకు దిగారు.

### చౌటపాలెంలో పోలీసుల జులుం...

పొన్నలూరు మండలంలోని చౌడపాలెంలో వినాయక చవితి పండుగ సందర్భంగా మంత్రి డోలా వీరాంజనేయ స్వామి ఆదేశాలతో పోలీసులు వ్యవహరించిన తీరు గ్రామంలో ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. టీడీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న వినాయకుడి నిమజ్జనం కోసం.. గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న వినాయకుడి నిమజ్జనాన్ని పోలీసులు బలవంతంగా నిలిపివేశారు. ఇది కాస్త వివాదంగా మారింది. వినాయక నిమజ్జనం కోసం గ్రామస్తులు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేయాల్సి వచ్చిందంటే పరిస్థితి అంచనా వేయవచ్చు. సంయమనంగా వ్యవహరించాల్సిన పోలీసులు గ్రామస్తులపై లాఠీలు ఝుళిపించారు. మహిళలని కూడా చూడకుండా దారుణంగా వ్యవహరించారు. దాంతో మేము నిమజ్జనం చేయం..మీరే చేసుకోండని గ్రామస్తులు ఎదురుతిరిగారు. వినాయకుడి విగ్రహాన్ని వదిలి వెళ్లడంతో సమస్య జటిలంగా మారింది. గ్రామస్తుల చేత నిమజ్జనం చేయించేందుకు కేసులతో బెదిరింపులకు దిగారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లను తీసుకెళ్లి పోలీసు స్టేషన్లో పెట్టారు. తొలుత గ్రామస్తుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐ గిరిబాబు ఆ తరువాత అధికార పార్టీ నాయకులు, అధికారుల ఒత్తిళ్లను భరించలేక సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఆయన తరువాత వచ్చిన ఎస్‌ఐ రమేష్ బాబు కేసులు మాఫీ చేస్తామని, వాహనాలు తిరిగి ఇస్తామని మాయమాటలు చెప్పి వినాయక నిమజ్జనం చేయించారు. ఆ తరువాత ఇప్పటి వరకు కేసులను రద్దు చేయలేదు, వాహనాలు ఇవ్వలేదు. దాంతో గ్రామస్తులు ప్రైవేటు కేసు వేసినట్లు సమాచారం.

### సివిల్ పంచాయితీలో అత్యుత్సాహం.. బాధితుడి ఆత్మహత్యాయత్నం...

దామరగుంట కుమార్ ఆత్మహత్యా ప్రయత్నం కేసును మరచిపోక ముందే ఒంగోలు టూన్ పోలీసుల దెబ్బకు మరో బాధితుడు ఆత్మహత్యా ప్రయత్నం చేయడం జిల్లాలో కలకలం సృష్టించింది. ఇది కూడా సివిల్ వివాదం కావడం గమనార్హం. అదికూడా రెండేళ్ల క్రితం నాటి కేసును తిరగదోడి విచారణ పేరుతో పిలిపించిన పోలీసులు రెచ్చిపోయారు. పొన్నలూరు మండలానికి చెందిన పరుచూరి రాజశేఖర్ కొత్తపట్నం మండలంలోని వజ్జిరెడ్డిపాలెంలోని వింటాస్ హేచరిస్‌లో రెండేళ్లపాటు పనిచేశారు. ఆ సమయంలో సుమారు రూ.4 కోట్లకు పైగా కంపెనీ నిధులు దుర్వినియోగం చేశాడని యజమాని ఎస్‌వి సుధాకర్ అప్పట్లోనే కొత్తపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడం, పెద్దల సమక్షంలో మాట్లాడుకోవడం జరిగిపోయాయి. అయితే ఇటీవల రాష్ట్రంలో తెలుగు దేశం సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసును తిరగదోడారు. గత నెల 17 న రాజశేఖర్‌ను కొత్తపట్నం పోలీసులు పిలిపించారు. ఆ తరువాత ఒంగోలు టూ టౌన్ పోలీసులు రంగంలోకి దిగి 27వ తేదీన పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. సీఐ మేడా శ్రీనివాసరావు నేరం అంగీకరించాలని ఒత్తిడి చేసినట్లు రాజశేఖర్ కుటుంబం ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే 30వ తేదీ పోలీసు స్టేషన్‌కు పిలిపించి ఏఎస్‌ఐ చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనివాసరావులకు అప్పగించారు. వారిద్దరూ కలిసి రాజశేఖర్‌ను చితక బాదారు. కాళ్లు కదలకుండా పైన కూర్చొని కాళ్లపై లాఠీలు ప్రయోగించారు. బాధితుడి చేత నేరం అంగీకరించినట్లు సంతకాలు తీసుకొని బయటకు పంపించారు. పోలీసుల దెబ్బలకు తాళలేక భార్యకు చెప్పుకొని విలపించిన రాజశేఖర్ మరుసటి రోజు పురుగుల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.



చికిత్స పొందుతున్న రాజశేఖర్

### దర్శిలో పోలీసుల ఓవరాక్షన్...

దర్శి ఎమ్మెల్యేగా డా.బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఎన్నికైనప్పటికీ అక్కడ ఓటమిపాలైన గొట్టిపాటి లక్ష్మి పెత్తనం కొనసాగుతోంది. ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి వాహనంపై దాడికి దిగిన వ్యక్తిని వదిలేసిన పోలీసులు దాడి జరగకుండా అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడిపై కేసు నమోదు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. అంతేకాకుండా దర్శి పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఎమ్మెల్యే శివ ప్రసాద్‌రెడ్డి చేపట్టిన నిరసన దీక్షను అడ్డుకునేందుకు మొత్తం గ్రామంలో 144 సెక్షన్ విధించడమే కాకుండా కనీసం నిత్యావసరాల కోసం కూడా ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా ఆంక్షలు విధించడం విమర్శల పాలైంది. ఎమ్మెల్యే శివప్రసాద్రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ లను గృహ నిర్బంధం చేయడం లాంటి చర్యలను ప్రజలు ఖండించారు.

## పరిమితి మేరకే పొగాకు సాగు చేయాలి

- పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

**మద్దిపాడు:** పొగాకు రైతులు సంతోషంగా ఉండాలంటే పరిమితి మేరకే సాగు చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అన్నారు. పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబుతో కలిసి వెల్లంపల్లిలో వేలం కేంద్రం ముగింపు సందర్భంగా శనివారం రైతులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పొగాకు పంట సక్రమంగా లేని పరిస్థితుల్లో మన దగ్గర ఉన్న పంటకు విపరీతమైన డిమాండ్ ఏర్పడి మూడేళ్లుగా మంచి లాభాలు పొందారన్నారు. వచ్చే సంవత్సరానికి ఎక్కువ కౌలు చెల్లించి పొగాకు పంట వేయడానికి సిద్ధపడుతున్నారని అన్నారు. అంతర్జాతీయంగా ఇప్పటికే బ్రెజిల్, టాంజానియా, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో పొగాకు పంట 600 మిలియన్ కేజీల పొగాకు పండిస్తున్నారని, వాతావరణ పరిస్థితులు వారికి అనుకూలిస్తే పొగాకు నాణ్యతను బట్టి కంపెనీలు కొనుగోలు చేస్తాయన్నారు. ఈ నేపథ్యంలో మనకు ఇప్పుడు ఉన్నంత ఎక్కువగా భవిష్యత్తులో పొగాకు కొనుగోలు చేస్తారని రైతులు భ్రమపడవద్దన్నారు. పొగాకు బోర్డు అనుమతులు ఇచ్చిన మేర మాత్రమే పంట సాగు చేయాలన్నారు. ఈ సంవత్సరం పొగాకు పంట సాగు లక్ష్యం 170 మిలియన్ కేజీలుగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ముందుగా బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం 215 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయన్నారు. వెల్లంపల్లి వేలం కేంద్రం అత్యధిక సగటు ధర రూ.281 కు పైగా నమోదైందని తెలిపారు. ముందుగా పొగాకు బోర్డు మెంబర్లు మారెడ్డి సుబ్బారెడ్డి, బీ బ్రహ్మయ్య, పీ వర ప్రసాద్ లు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం బోర్డు చైర్మన్‌ను ఈడీని మెంబర్‌లను బోర్డు సిబ్బందిని, వేలం నిర్వహణాధికారిని పొగాకు రైతు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వారి వెంట బోర్డు సెక్రటరీ వేణుగోపాల్, రీజినల్ డైరెక్టర్ కృష్ణశ్రీ, బోర్డ్ ఏఈఓ దామోదర్, వేలం నిర్వహణాధికారి కే రామకృష్ణ, ఫ్లోర్ లీడరు అబ్బూరి శేషగిరి, వరహాల చౌదరి, ఉమామహేశ్వరావు, రాఘవరెడ్డి, గోవిందరాజులు, వెంకయ్య, శ్రీరామమూర్తి తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

### చంద్రఘంట అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి




త్రిపురాంతకం చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్ర వాహనముపై శ్రీబాలాత్రిపురసుందరీదేవి

**త్రిపురాంతకం:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం త్రిపురాంతకంలో దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు శనివారం చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్ర వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో మూడో రోజు పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారి వాహన సేవలో పాల్గొన్నారు. ఆదివారం కూష్మాండ దుర్గ అలంకారంలో శేషవాహనంపై శ్రీబాలాత్రిపురసుందరీదేవి వాహన సేవ జరగనుంది.

## సోమరాజుపల్లి పంచాయతీ నిధులు స్వాహా

- టీడీపీ నాయకుడు, కార్యదర్శి కుమ్మక్కు
- నకిలీ బిల్లులతో నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా
- తీర్మానం లేకుండా తాను సంతకం చేయకుండా నిధులు డ్రాచేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ సరోజమ్మ

**సింగరాయకొండ:** గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి, గ్రామ టీడీపీ నాయకుడు శీలం వెంకట సుబ్రహ్మణ్యం కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా నకిలీ బిల్లులతో రూ.4.97 లక్షలు స్వాహా చేశారని..అందుకు పూర్తి ఆధారాలున్నాయంటూ మండలంలోని సోమరాజుపల్లి సర్పంచ్ యన్నాబత్తిన సరోజనమ్మ ఆరోపిస్తున్నారు. ఆమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు శనివారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సర్పంచ్ సరోజనమ్మ మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ కార్యదర్శి పనితీరు అనుమానంగా ఉండటంతో తీర్మానం రిజిస్టరు తన వద్దే ఉంచుకున్నానన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా, తన సంతకం లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పీఎంఎఫ్ వెబ్‌సైట్ ద్వారా రాజమార్గంలో 5 పద్దులుగా రూ.4,97,808 తో పాటు డిజిటల్ అసిస్టెంట్ జీతం రూ.60 వేలు కూడా డ్రా చేశారని ఆరోపించారు. వెబ్‌సైట్ నుంచి డ్రా చేసిన రూ.4,97,808 టీడీపీ నాయకుడు శీలం వెంకట సుబ్రహ్మణ్యం బ్యాంకు ఖాతాకు నేరుగా జమయ్యాయని ఆరోపించారు. దీనిపై శనివారం ఎంపీడీవో డీ జయమణి, ఈఓఆర్‌డీ సుధాకర్ దృష్టికి తీసుకెళ్లానని, ప్రస్తుతం ఇద్దరూ ఒంగోలులో ట్రైనింగ్‌లో ఉన్నామని సోమవారం వచ్చిన తరువాత ఏం జరిగిందో విచారణ చేస్తామని చెప్పారన్నారు. వాస్తవానికి సర్పంచ్‌కు తెలియకుండా నిధులు డ్రా చేయటం జరగని పని అని, కానీ ఏవిధంగా చేశారో వారి తెలివి తేటలను మెచ్చుకోవాలని అన్నారని సర్పంచ్ సరోజనమ్మ తెలిపారు. దీనికి తోడు ఈవో శ్రీనివాసరావు తనకు మంత్రి స్వామి అండదండలు ఉన్నాయని నమ్మబలికేందుకు ఈనెల 27వ తేదీ మంత్రి స్వామిని ఆయన ఇంటివద్ద కలిసి ఆ ఫొటోలు నాకు పంపాడని మీరు నన్ను ఏం చేయలేరని అంతా నా ఇష్టం అన్న ధోరణిలో కార్యదర్శి శ్రీనివాసరావు వ్యవహరించాడని అంటున్నారు. ఈనెల 28వ తేదీ ప్రపోజల్ పంపాడని, 29వ తేదీ నిధులు డ్రాచేశాడని ఆమె ఆరోపించారు. ఇటువంటి అవినీతిపరుడైన కార్యదర్శిని విచారించి సస్పెండ్ చేసి, దుర్వినియోగం అయిన నిధులను టీడీపీ నాయకుడి నుంచి రికవరీ చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆమె వివరించారు.



కలెక్టరు కు సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు కాపీ

## టమోత



కూరగాయల మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమోటాలు

- కేజీ రూ.100 కు చేరిన టమోట

**కొమరోలు:** కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ.40 ఉన్న టమోటా ధర శనివారం ఏకంగా రూ.100 కు చేరింది. వీటితో పాటు మిగిలిన కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి. కూరగాయలతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు.

## లో గ్రేడ్ 100



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

- పడిపోయిన లోగ్రేడ్ పొగాకు ధరలు

**టంగుటూరు:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో లో గ్రేడ్ పొగాకు ధర రూ.100కు పడిపోయింది. దీంతో పాటు 205 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు 740 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 535 కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.358 పలకగా, కనిష్ఠ ధర రూ.100, సరాసరి రూ.160.89 ధర పలికింది.

## క్లుప్తంగా

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన చిన్నమస్తాన్ వలి

మార్కాపురం: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి శనివారం సాయంత్రం మృతదేహమై కనిపించిన సంఘటన పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో జరిగింది. కాలనీలో నివాసం ఉండే షేక్ చిన్నమస్తాన్‌వలి (45) కూలీపని చేస్తూ నివసిస్తుంటాడు. భార్య ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం సాయంత్రం సమయంలో తర్లుపాడు రోడ్డులోని లిక్కర్ గోడౌన్ పక్కనే ఉండే కోళ్లఫారం దగ్గర అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించి స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించగా చనిపోయి ఉన్నాడని, కరెంటు షాక్ కొట్టి ఉండవచ్చని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

### తాళ్లూరు ఎంఈవో ఇంట్లో చోరీ

- రూ.లక్ష నగదు, 64 గ్రాముల బంగారం అపహరణ


మంచంపై చిందరవందరగా దొంగలు పడేసిన వస్తువులు

అద్దంకి రూరల్: తాళ్లూరు ఎంఈవో ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారం దోచుకెళ్లారు. అద్దంకి పట్టణంలోని ఎల్ఈఎఫ్ నగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని ఎల్ఈఎఫ్ నగర్‌కు చెందిన గురజాల సుబ్బయ్య ప్రకాశం జిల్లా తాళ్లూరు మండల ఎంఈవోగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎంఈవో దంపతులు నిద్రిస్తున్నారు. ఇంటి వెనుకవైపు వంటగది తలుపు ఘడియ తొలగించి లోనికి ప్రవేశించిన దొంగలు.. మరో బెడ్ రూమ్‌లోకి వెళ్లి బీరువా పక్కనే ఉన్న తాళాలు తీసుకుని బీరువా తెరిచారు. అందులోని రూ.లక్ష నగదు, సుమారు 64 గ్రాముల బంగారు నగలు అపహరించి వెళ్లిపోయారు. శనివారం ఉదయం ఎంఈవో దంపతులు నిద్రలేచి చూసేసరికి వంటగది తలుపు తీసి ఉంది. ఆందోళనగా బెడ్ రూంకు వెళ్లి చూడగా, బీరువా తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సీఐ కృష్ణయ్య, ఎస్సైలు ఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. మధ్యాహ్నం క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది.

### మృత్యువుగా మారిన లారీ

- వెనుక నుంచి ఢీకొనడంతో వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో గాయాలతో భాస్కర్

సింగరాయకొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కనుమల్ల అడ్డరోడ్డు వద్ద శనివారం ఉదయం చోటు చేసుకుంది. సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కావలి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తున్న భాస్కర్, పెంచలయ్యలను వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో తీవ్ర రక్త గాయాలతో రోడ్డుపై పడిపోయారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో భాస్కర్ (40) మృతి చెందాడు.


కంభంలో భువనేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు


ఒంగోలు : చాక్‌లెట్లతో గాయత్రీదేవి అలంకరణలో గంటాపాలెం పార్వతీదేవి


పొదిలి : శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు


వల్లూరులో అన్నపూర్ణాదేవిగా వల్లూరమ్మ


దొనకొండ ఆనందాశ్రమంలో కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు


ఒంగోలు : లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి


పామూరులో పార్వతీదేవి అలంకరణలో వాసవీమాత ఉత్సవమూర్తి

## అన్నపూర్ణాదేవీ.. నమోస్తుతే

దసరా సందర్భంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం మూడో రోజు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో విశేష పూజలందుకున్నారు. భక్తులు దర్శించుకుని ఓం శ్రీ మాత్రే నమః అంటూ పులకించిపోయారు. – సాక్షి, ఒంగోలు

# ఇంట్లో కూర్చునే మద్యం దుకాణానికి దరఖాస్తు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామోహిద్దీన్



ఒంగోలు టౌన్: నూతన మద్యం పాలసీ ప్రకారం జేబులో రెండు లక్షల రూపాయలున్న ఎవరైనా సరే ఇంట్లో కూర్చునే మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామోహిద్దీన్ తెలిపారు. స్థానిక ప్రకాశం భవనంలోని ఆయన చాంబర్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మద్యం పాలసీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. 11వ తేదీ కలెక్టర్ సమక్షంలో లాటరీ తీయనున్నట్లు చెప్పారు. 12వ తేదీ దుకాణాలు కేటాయించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు 58 షాపులకుగానూ 71 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నూతన మద్యం పాలసీ ప్రకారం లైసెన్సు రుసుంను నాలుగు స్లాబులుగా విభజించడం జరిగిందని తెలిపారు. 10 వేల రూపాయల్లోపు జనాభా ఉన్న ప్రాంతానికి 50 లక్షల రూపాయలు, 10 నుంచి 50 వేల జనాభా కలిగిన మండల కేంద్రానికి 55 లక్షల రూపాయలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న కేంద్రానికి రూ.65 లక్షల రూపాయలు, 5 లక్షల జనాభాకు మించిన ప్రాంతాలకు 85 లక్షల రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. ఆ మేరకు జిల్లాలోని 171 దుకాణాలకుగానూ 55 లక్షల శ్లాబు పరిధిలో 51 దుకాణాలు, 65 లక్షల శ్లాబు పరిధిలో 120 దుకాణాలు వచ్చాయన్నారు. ఈ నెల 1వ తేదీ గెజిట్ 127ను నోటిఫై చేసినట్లు తెలిపారు. గతంలో ఎర్నింగ్ మనీ డిపాజిట్ (ఈఎండి) పద్ధతి అమల్లో ఉండేదని, ఇప్పుడు దానిని రద్దు చేశామని తెలిపారు. ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక దుకాణానికి మాత్రమే అనుమతించేవారని, కానీ ఇప్పుడు ఒక వ్యక్తికి ఎన్ని దుకాణాలకైనా అనుమతించడం జరుగుతోందని తెలిపారు. అలాగే గతంలో దరఖాస్తులో ఇచ్చిన చిరునామాలో మాత్రమే దుకాణం ఏర్పాటు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు మండలం, నగర పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లను నాలుగు యూనిట్లుగా విభజించి ఆ యూనిట్‌లో ఎక్కడైనా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకునే వెసులుబాటును వ్యాపారులకు కల్పించామని ఖాజామోహిద్దీన్ వివరించారు.

**స్వామిభక్తిని ప్రదర్శిస్తూ...**

మద్యం పాలసీని వివరించడానికి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామోహిద్దీన్ తన స్వామి భక్తిని దాచుకోలేకపోయారు. మద్యం పాలసీ గురించి వివరించాల్సిన ఆయన.. ప్రస్తుత ప్రభుత్వాన్ని పొగుడుతూ విలేకరుల సమావేశాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో 2020 మేలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేయడం జరిగిందని, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పురందేశ్వరిలను కలిసి సెబ్ రద్దు చేయాలని తమ బాధలు చెప్పుకున్నట్లు తెలిపారు. తమ బాధను వారు ఆలకించారని చెప్పారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఈఎండీపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఖాజామోహిద్దీన్ బాధ్యతలు చేపట్టి వారం రోజులు దాటింది. అప్పటి నుంచి ఆయన కార్యాలయంలో ఎప్పుడు చూసినా తెలుగు తమ్ముళ్లే దర్శనమిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ బదిలీల విషయంలోనూ టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు చెప్పిన వారికే ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆ శాఖ ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

## లడ్డూ కల్తీపై జర్నలిస్టుల పాత్ర ఆక్షేపణీయం

- చంద్రబాబు చెప్పిన దాన్నే రాయడం బాధాకరం
- పవన్ కళ్యాణ్ చేస్తున్న హడావుడి చూసి జనం నవ్వుకుంటున్నారు
- సీనియర్ జర్నలిస్టు ఏఎం ఖాన్ యజ్దానీ


సెమినార్‌లో ప్రసంగిస్తున్న సీనియర్ జర్నలిస్టు ఖాన్ యజ్దానీ

ఒంగోలు టౌన్: తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పగానే నిజనిజాలను నిర్ధారించుకోకుండా జర్నలిస్టులంతా యధాతథంగా రాసేయడం ఆక్షేపణీయమని సీనియర్ జర్నలిస్టు, కథా రచయిత ఏఎం ఖాన్ యజ్దానీ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ డెమొక్రటిక్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శనివారం జరిగిన 'ప్రజాస్వామ్యం ఫలవంతంలో జర్నలిస్టుల పాత్ర' అనే అంశం మీద నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. నెయ్యి లోడు వచ్చిన తరువాత తిరుపతి దేవస్థానం వారు మూడు సార్లు పరీక్షలు నిర్వహించారని, నెయ్యి నాణ్యత సరిగా లేదని రిపోర్టు రావడంతో వెనక్కి పంపించారని వివరించారు. లడ్డూ కల్తీపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్న హంగామా చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు 100 రోజుల పాలన తరువాత రాష్ట్రంలో వచ్చిన మార్పు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏదైనా ప్రభుత్వ శాఖ బలంగా పనిచేస్తుందా అంటూ నిలదీశారు. కృష్ణా నదికి వరదలు వచ్చే అవకాశం ఉందని 15 రోజుల ముందే తెలిసి కూడా చంద్రబాబు ఎందుకు మేల్కోలేదన్నారు. వరద రాత్రికి రాత్రే రాదని, మహారాష్ట్రలో బయలు దేరి, కర్ణాటక మీదుగా, తెలంగాణా దాటుకొని ఆంధ్రప్రదేశ్‌కు వస్తుందని వివరించారు. ఒక్కో రాష్ట్రాన్ని దాటేందుకు నాలుగు రోజుల సమయం పడుతుందని, పైన వర్షాలు కురుస్తున్నాయని తెలిసి కూడా గోదావరి నీటిని కృష్ణా నదిలోకి పారించారని ఆరోపించారు. తీరా వరదలు వచ్చాక చేతులెత్తేశారని చెప్పారు. ఈ సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు


తలపడుతున్న చిత్తూరు-కర్నూలు జట్లు


90 పరుగులు చేసిన హేమంత్ రాయల్ ,


6 వికెట్లు తీసిన ప్రకాశం బౌలర్ దినేష్

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్సార్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 87 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు రెండోరోజు శనివారం 76 ఓవర్లలో 202 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని ఆశిష్‌రెడ్డి 41, శ్రీవంత్‌రెడ్డి 33 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు గిరిధారి 3, వివేక్ 3, అంకిత్ పరీక్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 56.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. జట్టులోని శ్రీవత్సవ 46, నాగచైతన్య 22 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు ఆశిష్‌రెడ్డి 2, తేజేష్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా, కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం...**

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 62 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 41.3 ఓవర్లలో 106 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని వినోద్ 41 పరుగులు, అక్షిత్‌రెడ్డి 28 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు దినేష్ 6 వికెట్లు, లోకేష్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 58 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. జట్టులోని ఆర్.హేమంత్‌రాయల్ 90 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్ లోహిత్ రాఘవేంద్ర 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో ప్రకాశం జట్టు 114 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం లభించింది.

**కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం...**

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 58 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 64.1 ఓవర్లలో 173 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని సుబ్బరాయుడు 34 పరుగులు చేశాడు. కడప బౌలర్లు హితేష్ సాయి 5, చెన్నకేశవ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 48.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా, కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులు చేసి ఉండటంతో కడపకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

# రాష్ట్ర ఖోఖో బాలికల జట్ల ఎంపిక


అండర్-14 రాష్ట్ర ఖోఖో జట్టు


అండర్-17 రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టును ఎంపిక చేశారు. శనివారం పంగులూరులోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 విభాగంలో రాష్ట్ర బాలికల ఖోఖో జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలో రాష్ట్రం నలుమూల నుంచి 100 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన బాలికలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 16, 17, 18 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో రాష్ట్ర రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ (కృష్ణా జిల్లా), బాపట్ల కోచ్ జే పాల్, ప్రకాశం జిల్లా కోచ్ డీఎల్ లక్ష్మినారాయణరెడ్డి, కడప జిల్లాకు చెందిన పీడీ ఎం పవన్‌కుమార్, సోమేశ్వరరావు (కృష్ణా జిల్లా), వి రఘుబాబు (ఇడుపులపాడు), సావిత్రమ్మ (కనిగిరి), లత (శ్రీకాకుళం), రత్తయ్య (కారంపూడి), శ్రీనివాసరావు, రాంబాబు, (తూర్పుగోదావరి), కే వీరాంజనేయులు, కె రామారావు (ముండ్లమూరు), సోమశేఖర్‌రెడ్డి (ఈదర)తదితరులు పాల్గొన్నారు.

**అండర్ -14 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు..**

కే భవాని (నెల్లూరు), షేక్ గౌస్య (నెల్లూరు), ఎం హారిక (శ్రీకాకుళం), ఎం యువశ్రీ (చిత్తూరు), జీ చందన (శ్రీకాకుళం), ఎం చందన లక్ష్మి (విజయనగరం), ఏ హేమలత (ప్రకాశం), బీ ఐశ్వర్య (ప్రకాశం), షేక్ మనీషా (గుంటూరు), జీ హరిత (కడప), పవి గని లక్ష్మి (తూర్పుగోదావరి), ఎస్ హారిక (విజయనగరం), కావేరి (అనంతపురం), డీ వినేష్ (కృష్ణా), హారిక (కర్నూలు), జీ గురవమ్మ (ప్రకాశం).

**అండర్-17 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు..**

కేకే ప్రీతి (నెల్లూరు), ఎస్ శ్రవంతి (నెల్లూరు), ఆర్ జాహ్నవి (విజయనగరం), ఏ పురందేశ్వరి (ప్రకాశం), టీ సుమతి (ప్రకాశం), కే స్వప్న (అనంతపురం), ఆర్ తనూజ (శ్రీకాకుళం), జీ భవాని (శ్రీకాకుళం), ఎస్ తేజశ్రీ (శ్రీకాకుళం), పి అర్చనశ్రీ (కర్నూలు), శ్రవంతి (కడప), బీ స్వాతి (తూర్పుగోదావరి), జీ అనిత (కృష్ణా), డీ లక్ష్మి (గుంటూరు), పీ జ్యోత్స్న (విశాఖపట్నం), సత్యవతి (చిత్తూరు), మణిచంద్రిక (తూర్పుగోదావరి).

# టీడీపీ నేతల లీలలు

- నకిలీ పత్రాలు సృష్టించి ఏకంగా రిజిస్ట్రేషన్
- లబోదిబోమంటున్న బాధితుడు
- న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్ ఆఫీసు ఎదుట ధర్నా


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న లింగోజీ, బంధువులు


లింగోజీకి 2022లో సర్వేయర్, 2024 వీఆర్‌వో ఇచ్చిన ధృవీకరణ పత్రాలు

మార్కాపురం రూరల్: రెవెన్యూ అధికారుల లీలల దెబ్బకు సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఒకే స్థలానికి రెండు సార్లు తప్పుడు ధృవీకరణ పత్రాలు అందించి అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించారు. దీంతో బాధితులు శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. బాధితుని వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామంలో గ్రామ కంఠానికి చెందిన సర్వే నంబరు 265లో 321.22 చదరపు అడుగుల స్థలం ఉంది. సదరు స్థలం 1941 నుంచి అనువంశికంగా ఉండగా..

2015లో సిందే వెంకటేశ్వరరావు నుంచి సిందె లింగోజీ కొనుగోలు చేసి రెండు రేకులషెడ్లు నిర్మించుకున్నాడు. గజ్జలకొండ పంచాయతీకి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తూ వస్తున్నాడు. అయితే కథ ఇక్కడే అడ్డం తిరిగింది. మార్కాపురానికి చెందిన కదం వెంకటేశ్వర్లు పేరుతో సెప్టెంబర్ 2024లో ఇదే స్థలానికి తప్పుడు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సృష్టించారు. ఆ తర్వాత దానిని ఆధారంగా చూపుకొని గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ నారు వెంకటేశ్వర రెడ్డి ఏకంగా తన పేరుతో సదరు స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నెల రోజుల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే ఈ తతంగంలో గజ్జలకొండకు చెందిన వీఆర్‌ఓ, సర్వేయర్లే కీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఇదే స్థలానికి వీరికంటే ముందుగా 2022లో వీఆర్‌ఓ, సచివాలయ సర్వేయర్ సిందే లింగోజీకి ఎంజాయ్‌మెంటు ధృవీకరణ పత్రాన్ని ఇచ్చారు. తప్పుడు ధృవీకరణపత్రాలను పొందిన వెంకటేశ్వర రెడ్డిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సిందే లింగోజీ, బంధువులు శనివారం ధర్నాకు దిగారు.

**ఇద్దరికీ ఎంజాయ్‌మెంటు పత్రాలు ఎలా ?**

2022లో తరకు ఎంజాయ్‌మెంటు రిపోర్టు ఇచ్చిన వీఆర్‌ఓ, సర్వేయర్లు అదే స్థలానికి 2024లో టీడీపీ నేతకు ఎంజాయ్‌మెంటు రిపోర్టును ఎలా ఇచ్చారని లింగోజీ ప్రశ్నించాడు. అతని రిపోర్టు ఇచ్చే సమయంలో తన నుంచి ఎలాంటి వివరణ కోరకుండా.. కొందరు అధికారులు, నాయకుల ఒత్తిడిలతో సర్వే రిపోర్టును పొందారని ఆరోపిస్తున్నాడు.

**అందినకాడికి దండుకుంటున్న వీఆర్‌ఓ**

గజ్జలకొండ సచివాలయం పరిధిలో వీఆర్‌ఓ ప్రతి పనికో రేటు.. ప్రతి సంతకానికో రేటు నిర్ణయించాడు. ఇలా అందినకాడికి ప్రజల వద్ద నుంచి దండుకునే పనిలో ఉన్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతన్ని మరో రెండు సచివాలయాలకు కూడా ఇన్‌చార్జిగా నియమించడంతో అతని చేతి వాటానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. తాజా వ్యవహారంలో టీడీపీ నేతల నుంచి పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.